

విజేత సూపర్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్

విజేత సూపర్ మార్కెట్ నూతన బ్రాంచ్ ప్రారంభం

మియాపూర్, మే 24(ఆంధ్రజ్యోతి): వ్యాపార రంగంలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తే వారు రాణిస్తారని మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విజేత సూపర్ మార్కెట్ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. తన డివిజన్ పరిధిలో 116వ శాఖను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో విజేత సూపర్ మార్కెట్ డైరెక్టర్స్ సందీప్, సిద్దు, ప్రసాద్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

టి-హబ్‌లో రీజెన్సీ వార్షిక అవార్డుల ప్రదానోత్సవం

రాయదుర్గం, మే 24(ఆంధ్రజ్యోతి): హోటల్ మేనేజ్‌మెంట్ రంగంలో యువతకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ కలినరీ అసోసియేషన్ అధ్యక్షుడు చెఫ్ మంజీత్ సింగ్ గిల్ అన్నారు. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలోని టి-హబ్ ఆడిటోరియంలో శనివారం రీజెన్సీ కాలేజ్ ఆఫ్ కలినరీ ఆర్ట్స్ అండ్ హోటల్ మేనేజ్‌మెంట్ 31వ రీజెన్సీ అన్యువల్ అవార్డ్స్ సెర్మనీ (వార్షిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో రీజెన్సీ లీడర్‌షిప్ అవార్డు, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు ప్రముఖంగా నిలిచాయి. కార్యక్రమంలో ఐఎఫ్‌సీఏ జనరల్ సెక్రెటరీ చెఫ్ విజయ్‌భాస్కరన్, మారియట్ జనరల్ మేనేజర్ ఎలీజర్ ప్రకాష్, రాయల్ ఆర్కైడ్ హోటల్స్ వైస్ ప్రెసిడెంట్ కుమార్ మనీష్, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మియాపూర్‌లో తిరంగా యాత్ర

గచ్చిబౌలి, మే 24(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో భారత సైనికుల విజయానికి మద్దతుగా సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ శేరిలింగంపల్లి, హఫీజ్‌పేట, బీజేపీ నాయకుడు బోయిని మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు. శనివారం మియాపూర్ నుంచి మైత్రినగర్ కమాన్ వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వరకు యాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో సినీ నటుడు ఆర్కే నాయుడు పాల్గొని సైనికులకు మద్దతు పలికారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభను విజయవంతం చేయాలి

- పార్టీ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ

హైదర్‌నగర్,మే24(ఆంధ్రజ్యోతి): సీపీఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా 4వ మహాసభ ఆదివారం ఈసీఐఎల్ బంజారా ఫంక్షన్‌హాల్‌లో జరుగుతుందని, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ కోరారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యదర్శి సభ్యులు బోస్, జాతీయ సమితి సభ్యులు యూసుఫ్ హాజరవుతారని తెలిపారు.



సభ్యత్వ ఐడీ కార్డులను వాలంటీర్లకు అందజేస్తున్న మహేందర్ రెడ్డి, శంకర్ గౌడ్

వారం రోజుల్లో జనసైనికులకు ఐడీ కార్డులు

- పార్టీ ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

హైదర్‌నగర్, మే 24(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతీ జనసైనికుడికి, వీరమహిళలకు క్రియాశీలక సభ్యత్వ ఐడీ కార్డులను అందజేస్తామని జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు, టీటీడీ బోర్డు మెంబర్ మహేందర్‌రెడ్డి తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ఐడీ కార్డులను అందజేస్తామని వాటిని వారం రోజుల్లో జనసైనికులకు, వీరమహిళలకు క్రియాశీలక వాలంటీర్లకు పంపిణీ చేయాలని కోరారు. కూకట్‌పల్లి గ్రావిటీ హోటల్‌లో శనివారం రాష్ట్ర జనసేన పార్టీ వాలంటీర్లతో మహేందర్‌రెడ్డితో పాటు జనసేన పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్‌గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రేమ్‌కుమార్ సమావేశమయ్యారు. శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు రాష్ట్రంలో మరణించిన, గాయపడిన జనసైనికులకు సుమారు కోటి మూడున్నర లక్షల బీమాను జనసేన పార్టీ ఇచ్చిందని, ఈ బీమా పద్ధతిని ఇతర పార్టీలు కూడా అనుసరిస్తున్నాయని అన్నారు. అందరూ కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామం, జిల్లాలో, గ్రేటర్ హైదరాబాద్‌లో బలోపేతం చేయాలని నాయకులకు సూచించారు.

తప్పిపోయిన చిన్నారులు తల్లిదండ్రుల చెంతకు

- రెండు గంటల్లోనే అప్పగించిన బాలానగర్ పోలీసులు

బాలానగర్, మే 24(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు చిన్నారులు శుక్రవారం రాత్రి తప్పిపోయారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆడుకుంటూ ఇంటి నుంచి బయటకు వచ్చి తప్పిపోయిన చిన్నారులను పోలీస్ స్టేషన్‌కు తరలించి వారి వివరాలను రాబట్టిన బాలానగర్ పోలీసులు రెండు గంటల లోపే తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. దీంతో సోషల్ మీడియాల్లో బాలానగర్ పోలీసులపై ప్రశంసలు కురుస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. బాలానగర్ బీబీఆర్ ఆసుపత్రి వద్ద చరబండరాజు కాలనీకి చెందిన వేణుగోపాల్ కుమారుడు తనూష్(3), గిరినగర్‌కు చెందిన రావి మల్లేశ్వర్‌రావు కుమారుడు రోహిత్(10) గిరినగర్ బస్టాపు వద్ద ఏడుస్తూ కనిపించడంతో పెట్రోమొబైల్ పోలీసులు చిన్నారులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారి పేర్లు, తల్లిదండ్రుల పేర్లను తెలుసుకుని వివరాలను కాలనీ అసోసియేషన్ల వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. దీంతో వారి తల్లిదండ్రులు స్టేషన్‌కు వెళ్లడంతో చిన్నారులను అప్పగించారు. బాధ్యతగా వ్యవహరించిన సిబ్బందిని సీఐ నర్సింహరాజు అభినందించారు.



తనూష్‌ను అతడి తల్లికి అప్పగించిన బాలానగర్ కానిస్టేబుల్ చంద్రకళ

రహదారి విస్తరణ ఎప్పుడు?

- హఫీజ్‌పేట్-గచ్చిబౌలి మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- అధికారుల సమన్వయలోపమే కారణం
- త్వరగా పనులు పూర్తి చేయాలని వాహనదారుల విజ్ఞప్తి

మియాపూర్, మే 24(ఆంధ్రజ్యోతి): కీలకమైన ప్రాంతంలో రహదారుల విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతోంది. చందానగర్ సర్కిల్ పరిధిలోని హఫీజ్‌పేట్-గచ్చిబౌలి మార్గంలో సీఆర్ ఫౌండేషన్ సమీపంలో రహదారి విస్తరణ పనులు ఏడాదికి పైగా పెండింగ్‌లో ఉన్నాయి. 400 మీటర్ల మేర ఉన్న పుట్‌పాత్‌పై పెద్ద సంఖ్యలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నాయి. ఇదే ప్రాంతంలో లింక్ రహదారి, కొండాపూర్ ఆర్టీవో కార్యాలయం, కొత్తగూడ ఫ్లైవంతెన ఎక్కేందుకు అనుసంధాన దారి, మరోపక్క యూటర్న్ ఉండడంతో ట్రాఫిక్ కష్టాలు తీవ్రంగా ఉన్నాయి.

ఏడాది క్రితమే నిధులు మంజూరు..

ఏడాది క్రితమే రోడ్డు విస్తరణకు నిధులు మంజూరైనా అధికారుల సమన్వయ లోపంతో పనులు ప్రారంభం కాలేదు. గతంలో జోనల్ కమిషనర్ యుద్ధప్రతిపాదికన పనులు చేపట్టాలని ఆదేశించారు. అందులో భాగంగానే యశోద ఆస్పత్రి ముందు పనులు పూర్తి చేశారు. అదే ఉత్సాహం కొండాపూర్ రహదారి విస్తరణకు చూపలేదు. దీంతో స్థానికులు అసంతృప్తితో ఉన్నారు.

రోడ్డు విస్తరణకు ఆటంకాలు..

పుట్‌పాత్‌పై 40 వరకు చెట్లు 10 విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్, అదే ప్రాంతంలో తాగునీటి చాంబర్ ఉన్నాయి. వీటిని తొలగించేందుకు ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. 15రోజుల క్రితం బల్దియాలోని కమిటీ సభ్యులు సైతం చెట్ల తొలగింపు అంశాన్ని పరిశీలించారు. ఎలక్ట్రిక్ విభాగం అధికారుల రెండుసార్లు పరిశీలన పూర్తి చేసినా పనులు మాత్రం ముందుకు సాగడంలేదు. ఇక్కడ ఉన్న చెట్లను తొలగించి నల్లగండ్ల ప్రాంతంలో ట్రాన్స్‌లోకేట్ చేసేందుకు యూవీడీ విభాగం ప్రణాళికలతో సిద్ధంగా ఉంది. కమిటీ నివేదిక, ఎలక్ట్రికల్ విభాగం ద్వారా విద్యుత్ స్తంభాల మార్పు ప్రక్రియను పూర్తిచేస్తే రహదారి విస్తరణ పనులను చేపట్టేందుకు చందానగర్ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు సిద్ధంగా ఉన్నారు.



సీఆర్ ఫౌండేషన్ వద్ద ఉన్న చెట్లను పరిశీలిస్తున్న అధికారులు

అడ్డంకులను తొలగించాలి

రోడ్డు విస్తరణకు కొన్ని అడ్డంకులు ఉన్నాయి. సంబంధిత విభాగాల అధికారులు ఆ అడ్డంకులను తొలగిస్తే వెంటనే పనులు ప్రారంభిస్తాం. త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- దుర్గాప్రసాద్, డీఈ, చందానగర్ సర్కిల్

డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి, మే 23(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మాదవహిల్స్‌లో రూ.1.60 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు కార్పొరేటర్లు నాగేందర్‌యాదవ్, గంగాధర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. కాలనీలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

టీఎన్‌జీఓ కాలనీలో..

రాయదుర్గం, మే 24 (ఆంధ్రజ్యోతి): మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని టీఎన్‌జీఓ కాలనీలో రూ.6.74 కోట్ల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి పైపులైను, భూగర్భ డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో కలిసి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గణేష్ ముదిరాజ్, మంత్రిప్రగడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానం.. ఆస్పత్రి ఆవరణ



ఆస్పత్రి ఆవరణలో పేరుకుపోయిన చెత్త

గచ్చిబౌలి, మే 24(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి రోజు రోజుకు దయనీయంగా మారుతోంది. ఆసుపత్రి ఆవరణ పూర్తిగా చెత్తాచెదారంతో నిండిపోయింది. ఆసుపత్రిలో తగిన సంఖ్యలో స్వీపర్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు పరిసర కాలనీల ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను ఆసుపత్రి ఆవరణలో వేస్తున్నారని ఆరోగ్య కేంద్రం సిబ్బంది చెబుతున్నారు. గతంలో జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణలో ఆసుపత్రి పారిశుధ్య పనులు జరిగేవి. అయితే ప్రస్తుతం పర్యవేక్షణ బాధ్యతలు జీహెచ్ఎంసీ చూడడం లేదని, అందువల్లే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అపరిశుభ్రతలకు నిలయంగా మారిందని స్థానికులు అంటున్నారు. ఆస్పత్రిలోని బోరుబావి పది రోజుల నుంచి పనిచేయడం లేదని, దీంతో దూరప్రాంతాల నుంచి తాగునీటిని సరఫరా చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని సిబ్బంది వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి స్వీపర్లను నియమించాలని, ఇతర సమస్యలను సైతం పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

భారీ వర్షం.. స్తంభించిన ట్రాఫిక్

- రోడ్లపైకి చేరిన నీరు
- కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు
- తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలు

మియాపూర్, మే 24(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయం కావడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించింది. ఆల్విన్‌కాలనీ చౌరస్తా నుంచి మియాపూర్ సిగ్నల్ వరకు దాదాపు మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. గచ్చిబౌలి, రాయదుర్గం, మాదాపూర్, చందానగర్, లింగంపల్లి, మియాపూర్ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో వర్షపునీరు మోకాలిలోతు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాలాల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడం, పలు ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణాల వల్ల నాలాలు పూర్తిగా ధ్వంసమవ్వడంతో వర్షపునీరు రోడ్లపై ప్రవహించి కాలనీల్లోకి చేరింది. ఆల్విన్‌కాలనీ, మియాపూర్, గంగారం చౌరస్తాల్లో ట్రాఫిక్ స్తంభించింది. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు చేరి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో నల్లగండ్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి నెమ్మదిగా కదిలాయి. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



వర్షంతో జలమయమైన రోడ్డు



స్పీడ్ బ్రేకర్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

తులసివనం వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు

హైదర్‌నగర్, మే 24(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషాముళ్లపూడి ప్రధాన రహదారిలో తులసివనం వద్ద ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఇక్కడ స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయించాలని తులసివనం అపార్ట్‌మెంటు వాసులు కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌ను కోరారు. స్పందించిన ఆయన ఎమ్మెల్యే గాంధీ, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి స్పీడ్ బ్రేకర్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటం, వేగంగా రావడంతో ఈ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారని, స్పీడ్ బ్రేకర్ ఏర్పాటుతో ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌కే రెడ్డి, శ్రావణ్‌కుమార్, కృష్ణ, హరి, కిషోర్, తులసివనం అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.



శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం

- కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్, మే 24(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్‌లోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. చరబండరాజు నగర్‌లో ఉన్న మాలజంగం కులస్థుల శ్మశానవాటిక అభివృద్ధి, సుందరీకరణ పనులకు కార్పొరేటర్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. శ్మశానవాటిక అభివృద్ధికి రూ.40 లక్షల నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. కొన్ని రోజుల క్రితం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులతో కలిసి శ్మశానవాటికలను సందర్శించారని, వాటి అభివృద్ధికి నిధులు కావాలని అధికారులను కోరడంతోనే నిధులు మంజూరైనట్లు తెలిపారు. వర్షాకాలం నాటికి పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు.

భారతీనగర్ డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

భెల్‌కాలనీ, మే 24(ఆంధ్రజ్యోతి): భారతీనగర్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, గ్రీన్ వేస్ట్ వ్యర్థాలను తొలగించడంలేదని డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అన్నారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, శేరిలిగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జీహెచ్ఎంసీ అధికారులతో జరిపిన చర్చల వివరాలను ఆమె వెల్లడించారు. ఎల్ఐజీ కాలనీ, మ్యాక్‌సొసైటీ ప్రధాన రహదారికి ఇరువైపులా ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తకుప్పలు పేరుకుపోయాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చామన్నారు. దుర్గంధభరితంగా మారిన ఈ ప్రాంగణంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా తయారైందని, దుర్వాసన వెదజల్లుతుందన్నారు. పారిశుధ్య సమస్యకు సంబంధించి గతంలో అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారని, అయినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. బీహెచ్ఈఎల్ యాజమాన్యంతో చర్చించి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆమె వెల్లడించారు.



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను సత్కరిస్తున్న ప్రశాంతిహిల్స్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

చెరువును కాపాడిన హైడ్రా కమిషనర్‌కు సత్కారం

హైదరాబాద్ సిటీ, మే 24(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి పరిధిలోని రాయదుర్గం చెరువును కాపాడిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ప్రశాంతిహిల్స్ కాలనీ సంక్షేమ సంఘం ఘనంగా సత్కరించింది. కాలనీ ప్రతినిధులు శనివారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా చెరువును కాపాడుకునేందుకు అవస్థలు పడ్డామని, చెరువు ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు రాత్రి పగళ్లు కాపాలా కాయాల్సి వచ్చిందన్నారు. హైడ్రా సమర్థ నిర్ణయం, సత్వర చర్యల వల్ల 3,600 చదరపు అడుగుల (రూ.100 కోట్ల విలువైన) చెరువు స్థలాన్ని కబ్జాదారుల చెర నుంచి కాపాడారన్నారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. చెరువులు, రహదారులు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా ప్రజలు చూడాలన్నారు. ఒకవేళ ఎవరైనా కబ్జాలకు పాల్పడితే హైడ్రాకు ఫిర్యాదు చేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సైబరాబాద్ జాయింట్ సీపీ భూపాల్

రోడ్డు ప్రమాదాల నివారణపై సమీక్ష

హైదరాబాద్ సిటీ, మే 24(ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలపై ట్రాఫిక్ అధికారులతో సైబరాబాద్ జాయింట్ సీపీ గజారావ్ భూపాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గచ్చిబౌలి కమిషనరేట్‌లో శనివారం నిర్వహించిన ఈ సమావేశంలో రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించడం, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించారు. అంతేకాకుండా వాహనాల రద్దీని బట్టి సిగ్నల్స్ వద్ద సమయం పెంపు, పాదచారుల భద్రత, ఫుట్‌పాత్‌ల ఏర్పాటు, రోడ్డు విస్తరణ, ఆక్రమణల తొలగింపు, ఉల్లంఘనలపై చర్యలు, పార్కింగ్ ఏర్పాట్లు, వర్షాలు కురిసే సమయంలో ట్రాఫిక్ నియంత్రణ, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, కార్లు, ద్విచక్రవాహనాలు, పాదచారులకు ప్రత్యేక లైన్‌ల ఏర్పాటు అంశంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారులతో కలిసి జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్

వీధి వ్యాపారులను ఆదుకోవాలి

కూకట్‌పల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): మూసాపేట కూడలి నుంచి ఆంజనేయనగర్ వరకు రోడ్డు విస్తరణలో భాగంగా దుకాణాలు కూల్చివేయడంతో రోడ్డున పడిన 8 మంది వ్యాపారులను ఆదుకోవాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌ను మూసాపేట కార్పొరేటర్ కోరారు. శనివారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్‌తో కార్పొరేటర్ మాట్లాడారు. వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, కూల్చివేతల సమయంలో వారికి ముందస్తు సమాచారం ఇచ్చిఉంటే ఆస్తినష్టం జరిగి ఉండేది కాదన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగరావు, బీజేపీ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

హైదర్‌నగర్, మే 24(ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఫేజ్-3 వార్డు ఆఫీసులో అన్ని విభాగాల అధికారులు, కాలనీ అసోసియేషన్ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కాలనీలోని సమస్యలపై అసోసియేషన్ సభ్యులు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఎక్కడ ఏ సమస్య ఉంటే దానిని సంబంధిత శాఖ అధికారులు సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఏదైనా ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎస్టీపీ ప్లాంటు పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఏఈలు రంజిత్, వర్షిని, హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, ఎంటమాలజీ ఏఈ సోని, మహేందర్, ఎస్ఎస్ జమీల్, ఎస్ఆర్‌పీ శ్రీనివాస్, యూబీడీ సమత తదితరులు పాల్గొన్నారు.



డివిజన్లవాసులతో మాట్లాడుతున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ సాబేరు అలీ,

సమస్యలను సత్వరం పరిష్కరిస్తాం

●కాంగ్రెస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ 13,14 డివిజన్లలోని పలు కాలనీల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సాబేరు అలీతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీల్లో ఉన్న సమస్యలను వారు పరిశీలించారు. వీటిని సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తామని డివిజన్‌వాసులకు వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేషన్ సిబ్బంది కుమార్ యాదవ్, శ్రీశైలంయాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు ఇందిర, గంగాధర్, శ్రీనివాస్, శ్రీదేవిలతో పాటు కాలనీల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు లబ్ధి

నిజాంపేట్, మే 24 (ఆంధ్రజ్యోతి) : వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసా ఇస్తోందని, అనారోగ్యం బారిన పడిన ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురు అనారోగ్య సమస్యలతో పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ వైద్య చికిత్సలకు ఆర్థిక సహాయం అందించాలని హన్మంత్‌రెడ్డిని ఆశ్రయించారు. వారి వివరాలు తీసుకున్న ఆయన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ద్వారా ఎనిమిదికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి నిధులు మంజూరు చేయించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన గట్టయ్యకు రూ.60 వేలు, ప్రగతినగర్‌కు చెందిన పోసాని సీతకు రూ.60 వేలు, 130వ డివిజన్ నార్లకంటి కృష్ణ చింతల్ నివాసి శాంతి స్వరూప్‌లకు రూ. 60 వేలు, జీడిమెట్ల డివిజన్ వాసి రఘుపతిరావుకు రూ. 60 వేలు, కుత్బుల్లాపూర్‌కు చెందిన భాగ్యలక్ష్మికి రూ.47,500లు, సూరారం వాసి సాయమ్మకు రూ. 60 వేలు మంజూరయ్యాయి. మొత్తం 5 లక్షల విలువ చేసే ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్‌ఓసీ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు కొలన్ హన్మంత్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కాలనీలో తిరుగుతున్న కుక్కలు

ఇందిరమ్మ కాలనీలో వీధి కుక్కల బెడద

దుండిగల్, మే 24 (ఆంధ్ర జ్యోతి) : దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీలో కుక్కల బెడద విపరీతం పెరిగింది. ఏ వీధిలో చూసినా గుంపులుగా కుక్కలు స్వైర విహారం చేస్తూ రోడ్లపై వెళ్లే వారిపై దాడి చేసేందుకు యత్నిస్తున్నాయి. గతంలో మున్సిపల్ అధికారులు వీధి కుక్క లను పట్టుకొని వాటికి ఇంజక్షన్ చేయించి వదిలేశారు. ప్రస్తుతం కాలనీలో ఏ వీధిలో చూసినా కుక్కలు పెరిగిపోవడంతో పిల్లలు, పెద్దలు రోడ్డుపై వచ్చేందుకు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకుంటే బాగుంటుంది.



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, స్థానికులు

ఉచిత వైద్యశిబిరాలతో పేదలకు మేలు

నిజాంపేట్, మే24 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాల వల్ల పేదల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని డాక్టర్ రాజు అన్నారు. ప్రగతినగర్‌లో శనివారం మాధవ్‌బాగ్ ఆయుర్వేదిక్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈసీజీ, షుగర్, కిడ్నీ, లివర్ పరీక్షలను ఆసుపత్రి సిబ్బంది నిర్వహించారు. డాక్టర్ కిషన్, అనూహ్య, సిబ్బంది మైత్రీ, కిషన్, సునీల్, జగదీష్ పాల్గొన్నారు.


ఎంసీపీఐ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

● యూఎస్‌ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్

గాజులరామారం, మే 24 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరిగే ఎంసీపీఐ తెలంగాణ రాష్ట్ర మొదటి మహాసభను జయప్రదం చేయాలని యూఎస్‌ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్ ఒక ప్రకటనలో కోరారు. ప్రజా పోరాటంలో అమరులైన క్రామేడ్ మాదికాయల ఓంకార్, బీఎన్‌రెడ్డి నాయకత్వంలో నిత్యం నిర్బంధాలను ఎదుర్కొంటూ ప్రజా పోరాటాలను నిర్వహించి, ఆ పోరాటాల్లోని అసువులు బాసిన రత్నం లాంటి నాయకులు నేలకొరిగిన నేలపై మొదటి సారి ఎంసీపీఐ సభలు జరుగుతున్నాయన్నారు. ఈ సభలకు ప్రతీ ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పగలే విద్యుత్ దీపాల వెలుగులు

కుత్బుల్లాపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని బాపూ నగర్, శ్రీరాంనగర్‌ల్లో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. కొన్ని రోజులుగా రోజూ పగటిపూట వెలుగుతుండటంతో విద్యుత్ వృథా అవుతోందని స్థానికులు తెలిపారు. నిర్ణీత సమయంలో స్ట్రీట్‌లైట్లు పని చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.



బాపూనగర్‌లో పగటిపూట వెలుగుతున్న వీధి దీపాలు

నీటి బొట్టు.. ఒడిసి పట్టు!

- ఇంకుడు గుంతలు నిర్మిద్దాం.. నీటి వృథాను అరికడదాం
- భూగర్భ జలాలను పెంచుదాం
- నీటి ఎద్దడి నుంచి బయటపడదాం

కుత్బుల్లాపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు అడుగంటిపోకుండా ఉండాలంటే నీటి మట్టాన్ని పెంచాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టేందుకు ఇంటికో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలి. ఇలా చేయకపోవడం వల్లే నగరంలో నీటి ఎద్దడి నెలకొందని నిపుణులు అంటున్నారు. భూగర్భ జలాల పరిరక్షణ, ఇంకుడు గుంతల ప్రాధాన్యతపై పాలకులు, అధికారులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ప్రచారాన్ని ముమ్మరం చేసి ఎక్కడ పడిన వర్షపు నీటి బొట్టు అక్కడే ఇంకిపోయేలా చూడాలి.



సూరారంలోని ఓ ఇంటి వద్ద ఇంకుడు గుంత

తగ్గిపోతున్న వర్షపాతం..

ప్రతియేటా తగ్గిపోతున్న వర్షపాతం మూలంగా నగరవాసులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సి వస్తోంది. తాగునీటికే కాదు.. నిత్యం ఉపయోగించుకునే నీటికి కూడా ఇబ్బంది పడుతున్నారు. ప్రతి సంవత్సరం సగటు వర్షపాతం తగ్గిపోతుండటం, నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న ప్రస్తుత తరుణంలో ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వందలాది ఫీట్ల లోతులో వేసిన బోరుబావులు కూడా వేసవిలో చుక్క నీటిని కూడా ఇవ్వడం లేదు. ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకుంటే భూగర్భ జలాలు అడుగంటకుండా కొంత వరకైనా చూడవచ్చు.

- వర్షాకాలంలో ఇంటి పైకప్పు, ఇంటి ఆవరణలో పడే వర్షపు నీరంతా నేరుగా వెళ్లి డ్రైనేజీలో కలువకుండా ఇంటిలో ఉన్న బోరుబావి సమీపంలో ఇంకుడు గుంతలు, సంపుల్లోకి వెళ్లేలా చేయాలి. ఇలా చేయడం వల్ల నీటి ఎద్దడిని నివారించవచ్చు. ఇలాంటి చిన్న జాగ్రత్తలు పాటిస్తే బోరుబావుల్లో నీటి స్థాయి పడిపోకుండా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సంపుల్లోకి కూడా..

ఇంటిపై కప్పుపై పడి వృథాగా పోయే వాన నీటిని చిన్న జాగ్రత్తలతో కాపాడుకోవచ్చు. మన నగరంలో వార్షిక వర్షాపాతం సగటు 750 నుంచి 900 మిల్లీ లీటర్లు. దీని ప్రకారం 200 చదరపు గజాలలో ఉన్న భవనం పైకప్పుపై పడే వాన నీటిని ఇంటిలోని సంపులోకి మళ్లిస్తే రోజుకు 500 లీటర్ల నీరు అవసరమయ్యే ఇంటికి కనీసం 6 నెలల పాటు మనం వాడుకునే నీరు అందుతుం దని అధికారులు అంచనా వేస్తున్నారు. నగరంలో ప్రతి సంవత్సరం సుమారు 60 రోజుల పాటు వర్షం కురుస్తుం దని అధికారులు అంచనా. దీని ప్రకారం 200 గజాల ఇంటి పైకప్పు భవనంపై కప్పు పై వర్షం కురిసిన 60 రోజుల్లో పడే నీరు సుమారు లక్షన్నర లీటర్ల వరకు అవుతాయని అధికారులు అంటున్నారు. ఈ నీరు ఇంటి అవసరాలను తీర్చడమే కాకుండా నీరు అవసరం పడిన సమయంలో ట్యాంకర్లలో నీటిని కొనే ఖర్చులను కూడా తగ్గిస్తుంది.

తొలి ప్రాధాన్యం ఇవ్వాలి..

వర్షాలు కురిసిన సమయంలో వాన నీటిని సంరక్షించేందుకు తొలి ప్రాధాన్యతను ఇవ్వాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా నూతన భవనాల నిర్మించేటపుడు ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలి. భవనం విస్తీర్ణాన్ని బట్టి శాస్త్రీయంగా గుంతలను తవ్వించాలి. స్వచ్ఛమైన వర్షపు నీరు ఇంకుడు గుంతల్లోకి వెళ్లి అందులోనే ఇంకే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలి. అంతేకాకుండా నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తే నీటి ఎద్దడి నుంచి బయటపడవచ్చు.



ఆదర్శనగర్‌లోని ఇంకుడు గుంత



స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న భరత్‌సింహారెడ్డి

జీడిమెట్ల సమస్యల పరిష్కారానికి కృషి

పేట్‌బషీరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల గ్రామంలోని సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్‌సింహారెడ్డి కాలనీవాసులకు హామీ ఇచ్చారు. తమ గ్రామంలో విద్యుత్ స్తంభాల సమస్యతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఇటీవల భరత్‌సింహారెడ్డిని కలిసి తెలిపారు. దీంతో ఆయన శనివారం జీడిమెట్ల గ్రామంలో పర్యటించి స్థానికులను గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల బీజేపీ డివిజన్ అధ్యక్షులు రాజు, యశ్వంత్, వెంకూ, సిద్ధూ, లక్ష్మణ్, చంద్రశేఖర్, చిన్న, సోను, రాజ్‌గౌడ్‌లు ఉన్నారు.



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

అనాథలను ఆదుకోవడం అందరి బాధ్యత: కూన

పేట్‌బషీరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): అనాథలను ఆదుకోవడం అందరి బాధ్యత అని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని శ్రీకృష్ణనగర్ ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ సొసైటీలోని అనాథాశ్రమంలోని వృద్ధులకు ఆయన శనివారం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ బ్లాక్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌గౌడ్, బాలప్ప, నర్సింహ, సాయిగౌడ్, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ కార్యాలయం నుంచి ఐడీపీఎల్ చౌరస్తా వరకు బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా యాత్రకు తరలివెళ్లిన ఆ పార్టీ కొంపల్లి మున్సిపాలిటీ నాయకులు.
-పేట్‌బషీరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి)

గంజాయి తాగుతున్న నలుగురి అరెస్ట్

పేట్‌బషీరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి) : గంజాయి తాగుతున్న నలుగురిని పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. భాగ్యలక్ష్మి కాలనీకి చెందిన ఎం.యశ్వంత్‌కుమార్ (19) కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన ఎం.సంతోష్ (22), భాగ్యలక్ష్మి కాలనీకి చెందిన జి. చంద్రశేఖర్ (22), సుభాష్‌నగర్‌కు చెందిన ఎం.గౌతమ్ అలియాస్ జాన్సన్ (17) నలుగురు కలిసి ఫాక్స్ సాగర్ సమీపంలో గంజాయి తాగుతున్నారు. వీరి వ్యవహారంపై పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి పట్టుకున్నారు. నలుగురినీ అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.



ఎస్‌బీఐ వద్ద రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

అక్రమ పార్కింగ్‌తో అవస్థలు

పేట్‌బషీరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): రహదారి పక్కనే పార్కింగ్ చేయడంతో ఆ మార్గంలో వచ్చిపోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సుచిత్ర నుంచి గోదారి హోమ్స్ కాలనీకి వెళ్లే రోడ్డులో ఎస్‌బీఐ సమీపంలో మూలమలుపు ఉంది. అక్కడ ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయడంతో వాహనాలను తిప్పుకోవడానికి ఇబ్బంది కలుగుతోందని వాహనదారులు వాపోతున్నారు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పోలీసులు అక్కడ నిలిపిన వాహనాల ఫొటోలు తీసి చలాన్లు పంపించడం తప్ప.. అక్కడ వాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు, ప్రయాణికులు అంటున్నారు. అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాల ఫొటోలు తీసి, చలాన్ల పంపిచడం కన్నా రోడ్డుపై వాహనాలను నిలపకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వహించొద్దు

●అధికారులకు ఎమ్మెల్యే వివేకానంద్ ఆదేశం

నిజాంపేట్ , మే 24 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులపై అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కాలనీల్లోని సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే పనులు చేపట్టడం మంచిది కాదని, పనులు జరుగుతున్న ప్రాంతాల్లో అధికారుల పర్యవేక్షణ తప్పక ఉండాలని వివేకానంద్ అన్నారు. కార్యక్రమంలో నిజాంపేట్ కమిషనర్ సాబేరు అలీ , పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి: ఎమ్మెల్యే

పేట్‌బషీరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మండల స్థాయి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం కొంపల్లి మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతోంది. ఎమ్మెల్యే ఈ కార్యక్రమానికి శనివారం హాజరై ఉపాధ్యాయుల నుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు అవసరమైన అన్ని వసతులను ఉపాధ్యాయులు వినియోగించుకోవాలన్నారు. పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అవసరమైన విషయ పరిజ్ఞానంతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో దుండిగల్, గండిమైసమ్మ మండల విద్యాధికారి కృష్ణ, మండల రిసోర్స్ పర్సన్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో అగచాట్లు!

- ఇందిరమ్మ కాలనీలో అరకొర డ్రైనేజీ పనులు
- గుంతల్లో నీరు చేరి దుర్వాసన, దోమల బెడద
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



కాలనీలోని 57వ బ్లాక్ వద్ద నిలిచిన మురుగు నీరు

దుండిగల్, మే 24 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీవాసులు అరకొర డ్రైనేజీ పైప్‌లైన్ పనులతో అవస్థలు పడుతున్నారు. పూర్తి కాని పనులు కారణంగా ఆ గుంతల్లో నీరు నిలిచి దుర్వాసన, దోమలతో నరకయాతన పడుతున్నారు. ఈ విషయమై వారు, మున్సిపల్ కార్యాలయాల్లో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు.



కాలనీలో ఒక వీధిలో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

అక్కడక్కడా వదిలేశారు..

ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ వేసిన అధికారులు మధ్యలో అక్కడక్కడా పని పూర్తి చేయకుండా వదిలేశారు. దీంతో ఆ ప్రాంతంలో గుంతలు ఏర్పడి మురుగునీరు, వర్షపునీరు చేరి సమస్య ఏర్పడుతోంది. ఆ నీటిలో దోమలు వృద్ధి చెంది తమకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయని, తాము కుట్టడంతో అనారోగ్యం పాలవుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని, తమ ఘోష ఎవరికి చెప్పుకోవాలని వారు ప్రశ్నిస్తున్నారు.



మరో వీధిలో తవ్వి వదిలేసి గుంతలో చేరిన నీరు

- డ్రైనేజీ పైప్‌లైన్ వేసిన కాంట్రాక్టర్ పూర్తి స్థాయిలో మ్యాన్‌హోళ్లు అమర్చలేదు. దీంతో కాలనీవాసులు వాహనాలపై రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు. ముఖ్యంగా కాలనీలోని 56,57 బ్లాక్‌ల వద్ద పైప్‌లైన్ పనులు పూర్తికాక నీరు నిల్వ ఉండి, దోమలు బెడద విపరీతంగా పెరిగిందని స్థానికులు వాపోతున్నారు. మున్సిపాలిటీ అధికారులు ఒక్కసారి తమ కాలనీలో పర్యటించి, సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఇందిరమ్మ కాలనీవాసులు కోరుతున్నారు.

దోమలతో అనారోగ్యం



మా కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పూర్తి చేయకపోవడంతో గోతుల్లో మురుగు, వర్షం నీరు చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల కారణంగా ఇప్పటికే పలువురు అనారోగ్యానికి గురై ఆసుపత్రుల పాలయ్యారు. మిగిలి ఉన్న పైప్‌లైన్ పనులను పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా.

-కేవీ రావు, ఇందిరమ్మ కాలనీవాసి

ఏడాదిగా ఇదే పరిస్థితి



మా కాలనీలో అరకొర పైప్‌లైన్ పనులు చేసి వదిలేశారు. ఏడాది కాలంగా ఇదే పరిస్థితి. ప్రధానంగా 56,57 బ్లాక్ వద్ద వదిలేసిన డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని రెండుసార్లు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాం. అయితే, ప్రత్యేక యంత్రాన్ని తీసుకొచ్చి పని చేయిస్తామని చెప్పిన మున్సిపల్ సిబ్బంది మళ్లీ రాలేదు.

- కుమార్, ఇందిరమ్మ కాలనీవాసి